క్లుప్తంగా

విశ్రాంతి భవనాలు మంజూరు చేయండి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో నూతన విశ్రాంతి భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలను కలిసి వినతిపత్రం అందించారు. విశ్రాంతి భవనాల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన కార్యదర్శి



మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న రంగారావు

వైరా: ఇటీవల టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన వైరాకు చెందిన కట్ల రంగారావు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో కలిశారు. పీసీసీ కార్యవర్గంలో తనకు స్థానం కల్పించడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

కొణిజర్ల: గత ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా ఎరువుల కొరత రైతులను వేధిస్తున్నదని ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐకేఎస్ జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ డిమాండ్ చేశారు. బుధవారం కొణిజర్ల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే సొసైటీల ద్వారా ఆగ్రోసెంటర్‌ల ద్వారా రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయాలన్నారు. యూరియా, డీఏపీ కొరత లేకుండా చూడాలన్నారు.

మైనార్టీ పాఠశాలలో యోగా తరగతులు



యోగా శిక్షణలో విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో అంతర్జాతీయ యోగా దివాస్‌ను పురస్కరించుకొని బుధవారం జిల్లా మైనార్టీ గురుకుల ప్రాంతీయ కోఆర్డినేటర్ కె.వెంకట్రామయ్య పర్యవేక్షణలో యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. యోగా గురువు సీహెచ్ రామకృష్ణ విద్యార్థులకు యోగాసనాలు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. హోమియో వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోమియో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మట్టా నీలిమ, ఎఫ్ఎన్ఓ గౌతమి, కోఆర్డినేటర్ మమత, శేషగిరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకున్న భట్టి

ముదిగొండ: మధిర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న భట్టి విక్రమార్క, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ముదిగొండలో ఆగారు. ముదిగొండలోని మాజీ జెడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు నివాసంలో కాసేపు నాయకులతో అక్కడి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు సౌజన్య, నాయకులు ఉసికల రమేష్, మందరపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి బోనాల సమర్పణ

కారేపల్లి: కారేపల్లి శ్రీపెద్దమ్మతల్లి ఆలయ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా.. ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగిన వేడుకల్లో చివరిరోజు బుధవారం అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

గ్రామ మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తురక నారాయణ, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చప్టాలతో.. తప్పని తిప్పలు



కొణిజర్ల మండలంలోని పల్లిపాడు - తీగల బంజర మధ్య పొంగి ప్రవహిస్తున్న పగిడేరు వాగు (ఫైల్)

- అభివృద్ధికి నోచుకోని లోలెవల్ వంతెనలు
- వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పలుచోట్ల ఇబ్బందులు
- వర్షాలు వస్తే రాకపోకలు బంద్
- నిధుల కోసం ఎదురుచూపులు

వైరా: వర్షాకాలంలో ప్రతి ఏడాది లోలెవల్ వంతెనల వల్ల ఆయా గ్రామాల మధ్య ఉన్నచప్టాల పైకి వాగులో నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. ఆయా గ్రామాల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ప్రతిపాదనలు పంపి చేతులు దులుపుకుంటున్నారు. కానీ నిధులు మంజూరి కాకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. జిల్లాలో వైరా, సత్తుపల్లి, మధిర, తల్లాడ, కొణిజర్ల, కల్లూరు, వేంసూరు, పెనుబల్లి, ఏన్కూరు, కారేపల్లి మండలాల పరిధిలో అనేక గ్రామాల మధ్య లోలెవల్ బ్రిడ్జిల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో ఏకంగా రాకపోకలు నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రమాదకంగా పాత వంతెనలు..

కొన్నేళ్ల క్రితం వాగులపై నిర్మించిన చప్టాలు, లోలెవల్ వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వంతెనలు, చప్టాలపై గుంతలు ఏర్పడి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వైరా మండల పరిధిలోని గ్రామాల మధ్యలోని వాగులు, చెరువు అలుగులపై నిర్మించిన వంతెనలు తక్కువ ఎత్తులో ఉండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రధానంగా స్నానాల లక్ష్మీపురం - సిరిపురం గ్రామాల మధ్య, గన్నవరం - దాచాపురం గ్రామాల మధ్య, పుణ్యపురం - సిపాడు - తీగల బంజర గ్రామాల మధ్య, మల్లుపల్లి - కొణిజర్ల గ్రామాల మధ్య, తుమ్మలపల్లి - అన్నవరం గ్రామాల మధ్య పగిడేరు పొంగి ప్రవహిస్తుండటంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

- ఏన్కూరు మండలం జన్నారం - అంజనాపురం గ్రామాల మధ్య నిమ్మవాగుపై బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. రేపల్లివాడ - నాచారం గ్రామాల మధ్య లోలెవల్ వంతెన వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.
- కారేపల్లి మండలం పేరుపల్లి - మాదారం గ్రామాల మధ్య బుగ్గవాగు, కారేపల్లి - ఇల్లందు గ్రామాల మధ్య మద్దుల వాగు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది.

పనులు ప్రారంభిస్తాం..



నియోజకవర్గంలో ప్రధానంగా పల్లిపాడు-తీగల బంజర, జన్నారం-అంజనాపురం గ్రామాల మధ్య ఇప్పటికే ప్రతిపాదనలకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభిస్తాం. నియోజకవర్గంలో మిగిలిన గ్రామాల మధ్య ఉన్న సమస్యను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– మాలోత్ రాందాస్ నాయక్, ఎమ్మెల్యే, వైరా

ఇబ్బందిగా మారుతుంది..

లోలెవల్ వంతెనల వల్ల వర్షాకాలంలో ప్రతి ఒక్కరికీ ప్రయాణాలు చేయాలంటే ఇబ్బందిగా మారుతుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి వర్షాకాలంలో పగిడేరు వాగు పొంగే విషయం తెలియకపోవడంతో వెనుకకు వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలి.

– పృథ్వీ, వైరా

అంగన్‌వాడీల్లో చిన్నారులకు రక్ష



లక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు పరిశీలిస్తున్న సీడీపీఓ కమలప్రియ

కొణిజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు భద్రతతో పాటు ఆటపాటలతో కూడిన బోధన, పౌష్టికాహారం లభిస్తుందని ఐసీడీఎస్ ఖమ్మం రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ కమలప్రియ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువులు తూకాన్ని తనిఖీ చేశారు. చిన్నారుల ఆట పాటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.అరుణ, అంగన్‌వాడీ టీచర్ సువార్త, స్థానిక పాఠశాల హెచ్ఎం కరామత్ అలీ, జయరాజు, సుశీల, దివ్య, శ్రీలక్ష్మి, సౌజన్య, భవాని, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వద్దు.. సర్కారు బడి ముద్దు



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సాంస్కృతిక సారధి బృందం

కారేపల్లి: ప్రైవేట్ వద్దు.. సర్కారు బడి ముద్దు అంటూ తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాకారులు ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం కారేపల్లి హైస్కూల్‌లో బడి - బాట కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక సారధి కళాకారుల బృందం సర్కారు బడిలో ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు, నాణ్యమైన విద్యను వివరించారు. ఈ సదర్భంగా మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు మాట్లాడుతూ.. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించబడుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు.కళాకారులు బీరల్లి రమణ, మేడ ముప్పయ్య, మాచర్ల కృష్ణ, మునగాల వెంకటరత్నం, కస్తూర్బా ఎస్ఓ రూసీసౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



కల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్ శ్రీలక్ష్మి

కల్లూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ముమ్మరంగా అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపడుతున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కావడంతో అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ప్రారంభించారు. దీంతో పిల్లలను ఉత్సాహంగా కేంద్రాలవైపు ఆకర్షించేందుకు గాను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొత్తగా చేరిన విద్యార్థులకు పండగ వాతావరణంలో అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు హాజరయ్యారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి..



మాట్లాడుతున్న సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు

సత్తుపల్లిరూరల్: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని.. మహిళలు పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు అన్నారు. సత్తుపల్లి ఐకేపీ కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా(ఏఎల్ఈఏపీ) ప్రపంచ బ్యాంక్ నిధులతో డీఆర్‌డీఏ, సెర్ప్‌లతో కలిసి స్వయం సహాయక సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమల నిర్వాహణ, ఉత్పత్తులు, మార్కెటింగ్, మెళకువలు, నైపుణ్యాభివృద్ధి అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఏపీఎం సత్యవర్ధన్‌రాజు, సీసీలు కృష్ణయ్య, రామారావు, శ్రీను, నరేంద్ర, ఆలీవ్ సంస్థ రీజనల్ అధికారి సునీత, నోడల్ అధికారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



కోనా నరసింహారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మధిర: మండలంలోని మడుపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం కోనా సత్యనారాయణ గుప్తా(కేఎస్‌జీ) ఫౌండేషన్ ఆధ్వర్యాన నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు కోనా నరసింహారావు, కార్యదర్శి లక్ష్మీసావిత్రి సమక్షాన ప్రధానోపాధ్యాయులు లింగంపల్లి అప్పారావు పుస్తకాలతో పాటు పెన్నులు, పలకలు అందజేయగా, దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కనకపుడి నరేంద్రకుమారి, ఉపాధ్యాయులు కే.వీ.కృష్ణారెడ్డి, చిరంజీవి, అశోక్‌కుమార్, విజయ, నాగ శేషు, మేకల ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశోక్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని వెంకట రామాపురం ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు సంపసాల అశోక్ మెమోరియల్ నిర్వాహకులు వెంకటకృష్ణ బుధవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుకకొడపటి వెంకటేశ్వరరావు, మంగపతి, హెచ్ఎం కల్యాణి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు కుట్టు మిషన్ అందజేత



కుట్టుమిషన్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్‌రావు, సరిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారి సహకారంతో వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన కాంపల్లి శిరీష అనే నిరుపేద మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. వైరాలోని సాయి మందిరంలో బుధవారం నిర్వహించిన లయన్స్‌క్లబ్ కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ చేతుల మీదుగా కుట్టుమిషన్ అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, జీఎస్‌టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, అబ్బూరి రమేష్, బుచ్చిరామారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తల్లాడ: మండలంలోని మంగాపురం - గొల్ల గూడెం రోడ్డులో బుధవారం మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వేంసూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన కంటే శేఖర్ గౌడ్ మోటార్ సైకిల్‌పై గొల్లగూడెం నుంచి మంగాపురం వస్తుండగా మంగాపురం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోవటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు క్షతగాత్రుడిని 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఆళ్లపాడులో క్షేత్రస్థాయి పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమాదేవి

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమాదేవి మాట్లాడుతూ.. నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రి, ఆత్మా కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు పోటీలు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న పీఈటీలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు గానూ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఎంపిక ప్రక్రియకు రాగా.. వారి సామర్థ్యాలను పీఈటీలు పరిశీలించి పలువురిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.మురళీమోహన్ రావు, పీడీ మారాబత్తుల జమలయ్య, తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సత్తుపల్లి డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ అన్నారు. బుధవారం సత్తుపల్లి రెవెన్యూ కార్యాలయంలో అయ్యగారిపేట పరిధిలోని రైతాంగానికి భూ భారతిపై అవగాహన కల్పించారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందిస్తే త్వరలోనే పరిష్కారం చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జానిమియా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 589 దరఖాస్తులు..

తల్లాడ: తల్లాడ, బిల్లుపాడు గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. తల్లాడ రెవెన్యూ సదస్సులో 342 దరఖాస్తులు, బిల్లుపాడు సదస్సులో 247 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, సూపరింటెండెంట్ స్టాలిన్, ఆర్ఐలు ఖాజా మోయినుద్దీన్, భాస్కర్ పాల్గొన్నారు.

బస్‌సౌకర్యం కల్పించాలని వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

బోనకల్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖమ్మం బస్ డిపో సూపరింటెండెంట్ బత్తినేని రాములుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు కూరపాటి శ్రీను మాట్లాడుతూ.. మండలంలోని గోవిందాపురం (ఎల్), రావినూతల గ్రామాలకు బస్ సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్ పాస్‌లు ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందన్నారు. కొంతమంది విద్యార్థులు రెండు బస్సులు మారి మరీ రావాల్సివస్తుందని, ముష్టికుంట్లలో ఎక్స్‌ప్రెస్‌కు బస్టాప్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సాయికుమార్, శశాంక్, నాగరాజు, కృష్ణ, మల్లిక తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



కట్లేలేరులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్

వేంసూరు: మండల పరిధిలోని రామన్నపాలెం కట్లేలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో అక్రమ ఇసుక రవాణ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుంది. ఎటువంటి అనుమతులు లేకుండా రామన్నపాలెం వాగు నుంచి నిత్యం పగులు, రాత్రి తేడా లేకుండా మండలంలోని పలు గ్రామాలతో పెనుబల్లి మండలానికి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ట్రక్కు ట్రాక్టర్‌కు రూ.4 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. వర్షకాలం దృష్ట్యా వ్యాపారులు పలు ప్రాంతాల్లో ఇసుక డంపు చేసుకుంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీధికుక్కల స్వైర విహారం

- బలైపోతున్న మూగజీవాలు
- బెంబేలెత్తిపోతున్న జనాలు
- పట్టించుకోని అధికారులు



కారేపల్లి సినిమాహాల్ సెంటర్‌లో సంచరిస్తున్న వీధికుక్కలు



కుక్కల దాడిలో మృత్యువాత పడిన గొర్రెలు (ఫైల్)

వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు ఇంట్లో నుంచి బయటికి రావాలంటే కుక్కల బెడదతో వణికిపోవాల్సి వస్తుంది. చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలన్నా, వీధిలో ఆడుకోవాలన్నా.. కుక్కల భయంతో ఇంట్లో నుంచి బయటికి రాలేని పరిస్థితి.

కారేపల్లి: కారేపల్లిలోని మసీదు రోడ్డు, గణేష్ సెంటర్, బొడ్రాయి సెంటర్, అంబేద్కర్ నగర్, భారత్ నగర్, బీసీ కాలనీ, పాతశివాలయం వీధి, క్యాబిన్ బజార్, రజక బజార్, స్టేషన్ బజార్, బస్టాండ్ సెంటర్, సినిమాహాల్ సెంటర్, ముత్యాలమ్మ గుడి సెంటర్, లాడీస్ బజార్, పెద్దమ్మతల్లి గుడి బజార్‌లలో ఎక్కడ చూసినా.. పదుల సంఖ్యలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

దీంతో గ్రామ ప్రజలు వీధిల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. ఇక కొత్తవారు కారేపల్లిలోని ఏ వీధిలోకి వెళ్లాలన్నా.. అడుగడుగునా కుక్కల గుంపు కన్పిస్తుండటంతో ఏ కుక్క ఎప్పుడు, ఎక్కడ కరుస్తుందోనని భయం భయంగా గడపాల్సి వస్తుంది.

బలైపోతున్న మూగ జీవాలు..

ఊళ్లో దొడ్లల్లో తోలిన గొర్రెలు, మేకల మందలపై రాత్రి వేళల్లో కుక్కల గుంపు దాడి చేసి మరీ చంపివేస్తున్నాయి. దీంతో ఎంతోకాలంగా మూగజీవాలను పొంచుతున్న కాపరులకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. ఇటీవల కారేపల్లి బొడ్రాయి బజార్‌కు చెందిన జంగా మధు గొర్రెల దొడ్డిలోకి కుక్కల మంద ప్రవేశించి 21 గొర్రెలను చంపివేశాయి. దీంతో పాటు, మరో 10 జీవాలకు గాయాలైయ్యాయి. దీంతో అతనికి రూ.3లక్షల మేర నష్టం వాటిల్లినట్లు మధు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించారు. అదే విధంగా యాదవ బజార్ గ్రామంలోనిన యర్నాగి సతీష్‌కు చెందిన 15 గొర్రెలపై, రాబోతు రమేష్‌కు చెందిన 12 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. తమకు జీవనాధారమైన జీవాలు కుక్కల దాడిలో మృతి చెందడంతో తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

బయటకు రాలేకపోతున్నాం..



ఊళ్లో కుక్కలు అధికమయ్యాయి. ఇంట్లోనుంచి బయటకు రావాలంటే భయమేస్తుంది. ఇటీవల కుక్కల దాడిలో చాలామంది గాయాలపాలైన సంఘటనలు అనేకం. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు కుక్కలపై భయంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు కుక్కల సంఖ్యను తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

– జి.వెంకటేశ్వర్లు, బీసీ కాలనీ, కారేపల్లి